వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల కోసం విద్యాశాఖ కసరత్తు
- ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్న అధికారులు
- లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు సైతం నిరంతర కృషి



ఎన్‌బీటీ నగర్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

ఖైరతాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక క్లాసులతో పాటు వార్షిక పరీక్షల్లో వచ్చే మోడల్ పేపర్ల నమూనాతో ప్రతిరోజూ చాప్టర్ల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల్లో మొత్తం 17 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో 3 రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. మరో 2 ఎయిడెడ్ పాఠశాలలు, 4 మహాత్మా గాంధీ, జ్యోతిబా పూలే పాఠశాలలతో పాటు 150 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 2,003 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. గత ఏడాది ఈ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత 80 శాతం ఉండగా.. ఈ సంవత్సరం వంద శాతం సాధించేందుకు విద్యాశాఖ అధికారులతో పాటు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు

హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతిలో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా 45 రోజులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, దీనిని కచ్చితంగా అమలుచేయాలని ఆదేశాలిచ్చారు. దీని ప్రకారం ప్రతిరోజూ ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరొక సబ్జెక్టు వారీగా పదో తరగతి పరీక్ష పేపర్ల మోడళ్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి 24 నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 1 వరకు విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తుండగా, ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు ప్రీ ఫైనల్-1 పరీక్షలు.. మార్చి 6 నుంచి 15 వరకు ప్రీ ఫైనల్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. వీటితో పాటు ఫిబ్రవరి 21 నుంచి మార్చి 5 వరకు మరో రెండు ప్రత్యేక పరీక్షలు జరగనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి ప్రావీణ్యత తక్కువగా ఉన్న వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ పరీక్షలు నిర్వహిస్తూ భయం పోయేలా చేస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 8.45 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. గణితం, సైన్స్ సబ్జెక్టులపై మరింత ఫోకస్ పెడుతూ ముందుకెళ్తున్నాం. ఈ సారి గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనే కృతనిశ్చయంతో పని చేస్తున్నాం.

- సామ్యేల్‌రాజ్,
మండల ఉప విద్యాధికారి, ఖైరతాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు శాంసన్, జాన్ సుబ్బారెడ్డి

హెబ్రోన్ చర్చి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

- చర్చి పాస్టర్లు

పంజాగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తాలో ఉన్న హెబ్రోన్ చర్చి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని చర్చి పాస్టర్లు కె.ఎం.శాంసన్, జాన్ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా దైవజనుల సేవలో ఉన్న తమను హెబ్రోన్ చర్చిలోకి రాకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చి సభ్యులు కృపవరం, ఎఫ్రాయిమ్, పీజే డానియేల్ తదితరులతో కలిసి వారు మాట్లాడారు. 1979 నుంచి తాము హెబ్రోన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్నామని, ప్రస్తుతం చర్చిలో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. చర్చితో సంబంధం లేని వారు కాంపౌండ్ గేటుకు తాళం వేసి లోపల ఉన్నారన్నారు. హెబ్రోన్ ను కేవలం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌గా మాత్రమే చెబుతున్నారని, అక్కడ భక్తజనులకు ప్రార్థన చేసుకునే అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం, పోలీసులు జోక్యం చేసుకుని చర్చి గేట్లు తెరిపించాలని కోరారు.



వరంగల్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దర్శకుడు సముద్ర, జాజుల శ్రీనివాస్

'నూరేళ్ల నా ఊరు' చరిత్ర సృష్టిస్తుంది

బంజారాహిల్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమకు అనేక పాటలను అందించిన ఘనత వరంగల్ శ్రీనివాస్‌కు దక్కుతుందని సినీ దర్శకుడు సముద్ర అన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన 'నూరేళ్ల నా ఊరు' గేయ కావ్యం కార్యక్రమంలో బీసీ సంఘాల జాతీయ నాయకుడు జాజుల శ్రీనివాస్, సముద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ శ్రీనివాస్ చాలా గొప్ప రచయిత అని, దర్శకుడు దాసరి నారాయణరావుకు అనేక పాటలు రాసిచ్చారని చెప్పారు. తన చిత్రాలకు సైతం వరంగల్ శ్రీనివాస్ పాటలు రాశారని, అవి చరిత్ర సృష్టించబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూరేళ్ల నా ఊరు గేయ కావ్యం చరిత్ర సృష్టిస్తుందన్నారు. వరంగల్ శ్రీనివాస్ తెల్ల కాగితం లాంటి వాడన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రవిజంగ్ మల్లిక్ తేజ, అందె భాస్కర్, డబ్బు స్వామి, రేలా ప్రసాద్, గజ్వేలు వేణు తదితరులు పాల్గొన్నారు.



టీ షర్టులను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, దాతలు

ఫిబ్రవరి 2న 'రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్'

పంజాగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలికల సాధికారత, అభ్యున్నతి కోసం సేవా భారతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న గచ్చిబౌలి స్టేడియంలో 'రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్' 9వ ఎడిషన్ పేరుతో 21కె, 10కె, 5కె రన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్‌కు సంబంధించిన టీ షర్ట్స్, మెడల్స్‌ను పలువురు దాతలతో కలిసి సేవా భారతి ఉపాధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి జయప్రద దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికల సాధికారత కోసం కిశోరి యోజన ప్రాజెక్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1న గచ్చిబౌలి స్టేడియంలో ఉడాన్ ఉత్సవ్ పేరుతో స్థానిక వంటకాలు, హస్త కళా ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రన్‌లో పాల్గొనడానికి ఇప్పటికే పది వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని, ఫిబ్రవరి 2న గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రన్‌లో వారు పాల్గొంటారని.. మరిన్ని వివరాలకు 98480 34767 సంప్రదించాలని వారు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంగళరావునగర్, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36 ఫీడర్ల పరిధిలోని వెంగళరావునగర్, పోస్ట్ ఆఫీస్, శ్రీనివాస కాలనీ వెస్ట్, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36 పెద్దమ్మ టెంపుల్ నుంచి డౌన్ టౌన్ పబ్ వరకు, రోడ్ నంబర్ 40 ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు టీవీ-5, ఇంద్రానగర్ ఫీడర్ల పరిధిలోని రోడ్ నంబర్ 1, 9, టీవీ-5, ఇంద్రానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీవీ నటుడు విజయ్‌యాదవ్ తదితరులు

రేపు ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ ఎన్నికలు

బంజారాహిల్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఫిలిం చాంబర్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో సీనియర్ నటుడు విజయ్‌యాదవ్ మాట్లాడారు. అసోసియేషన్‌కు మేలు చేసే వారిని గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టెలివిజన్ కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా వినోద్ బాల ఆధ్వర్యంలో 27 ఏళ్ల క్రితం ఆర్టిస్టు అసోషియేషన్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. వందలాది మంది ఆర్టిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు అందరికీ మెడిక్లెయిమ్ చేయించామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్యానల్‌కు చెందిన భార్గవ గొట్టికొండ, చెన్నుపాటి సుబ్బారావు, రాంజగన్, జీఎస్ శశాంక్, కృష్ణ కిషోర్, ఉమాదేవి, బ్యాంక్ శ్రీనివాస్, దీప్తి పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత డేటా ఇంజనీర్ కోర్సు

బంజారాహిల్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువతకు విలువైన కెరీర్ అవకాశాలను అందించేందుకు సత్యసాయి సేవా సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ఉచిత డేటా ఇంజనీర్ కోర్సును ప్రారంభిస్తోంది. బీస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్, ఎంటెక్ 2021-2024 పాస్-అవుట్ గ్రాడ్యుయేట్లు ఈ కోర్సుకు అర్హులు. ఈ శిక్షణ కార్యక్రమం డేటా ఇంజనీరింగ్‌లో ప్రయోగాత్మక అంశాల గురించి వివరించడంతో పాటు కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పించనున్నారు. ఆసక్తి ఉన్నవారు 9052372023కు కాల్ చేయవచ్చు.

వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలి

- ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే



ఆటోడ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ప్రయాణించే వారు బాధ్యతగా వ్యవహరించాలని పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో బుధవారం 300 మంది ఆటో డ్రైవర్లతో అవగాహన సదస్సు జరిగింది. ఇందులో భాగంగా ఆటో డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. యూనిఫాం వేసుకోకపోవడం, స్టాప్ లైన్ దాటడం, సిగ్నల్ జంప్, లైసెన్సు లేకపోవడం, సరైన రిజిస్ట్రేషన్ లేకపోవడం, సరైన ప్రదేశంలో పార్క్ చేయకపోవడం, ఇన్సూరెన్స్ లేకపోవడం మొదలైనవి వాటివల్ల జరిగే నష్టాలను, ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డీసీపీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ఆకర్షించేందుకు రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారని, దీనివల్ల మిగతా వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారుతుందన్నారు. కొంతమంది మైనర్లు ఆటోలను నడుపుతున్నారని, ఇలాంటి ఘటనల్లో వాహనాలను సీజ్ చేయడంతో పాటు యజమానులపై కేసులు పెడతామని హెచ్చరించారు. ట్యాక్సీ యాప్‌ల కారణంగా తాము నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు చెప్పగా, విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



మహిళకు ఎల్ఓసీ అందజేస్తున్న కార్పొరేటర్ బాబా

బోరబండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పేదలు ప్రభుత్వ పథకాలతో కార్పొరేటర్ తరహా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం పొందాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. సైట్-2 కార్పొరేటర్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం అందజేశారు. సైట్-1కు చెందిన షేక్ సైదాబేగంకు రూ.2.25 లక్షలు, వీకర్ సెక్షన్ పెద్దమ్మ నగర్‌కు చెందిన జి.అనురాధకు రూ.2.50 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.



ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

యాంకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుల ఫిర్యాదు

ఎర్రగడ్డ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రముఖ టీవీ ఛానెల్ యాంకర్ బీజేపీ నాయకులను టార్గెట్ చేస్తూ తప్పుడు విమర్శలు చేసిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఓ టీవీ ఛానెల్‌లో పనిచేస్తున్న యాంకర్ ఇటీవల బీజేపీ నేత లంకాల దీపక్‌రెడ్డి మీద తప్పుడు విమర్శలు చేసిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పుడు విమర్శల మూలంగా బీజేపీ నాయకుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దర్శనం నాగేశ్వరరావు, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు బొట్ల విజయకుమార్, నాయకులు సుర సునీత, మల్లేష్, గణేష్, దుర్గరాజ్, దీపక్, హనికేతి యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్‌కు న్యాయం చేయాలని విద్యార్థినుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థినులు

బేగంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లెక్చరర్‌కు న్యాయం చేయాలంటూ ఓ కళాశాల విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. మహిళా లెక్చరర్ వీడియోలు తీసిన క్లర్క్, ప్రోత్సహించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా ఎన్ఎస్‌యూఐ నాయకులు రావడంతో బేగంపేటలోని మహర్షి కళాశాల వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు, ఇంటర్‌బోర్డు అధికారులు అక్కడికి చేరుకుని విద్యార్థినులతో మాట్లాడి ఆందోళన విరమించేలా చేశారు. విద్యార్థినులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహర్షి కళాశాలలో ఈ నెల 25వ తేదిన ఇంగ్లీషు లెక్చరర్ నాగేంద్రం విధులు ముగించుకొని ప్రిన్సిపాల్ గది వద్ద ఉన్న కుర్చీలో కూర్చున్నారు. ఆ సమయంలో కళాశాలకు చెందిన క్లర్క్ స్వామి సెల్‌ఫోన్‌లో వీడియో తీయడం గమనించిన ఆమె అతనితో వాగ్వివాదానికి దిగింది. ఈ విషయంపై లెక్చరర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రిన్సిపాల్ పోస్ట్ కోసమేనా..

బేగంపేట మహర్షి కళాశాలలో జరిగినదంతా ఆ కళాశాల ప్రిన్సిపాల్ పోస్ట్ కోసమే లెక్చరర్ చేసిన రాద్ధాంతం అని తెలిసింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పేరును దెబ్బతీయడానికి ఇదంతా చేశారని, 40 ఏళ్ల చరిత్ర ఉన్న తమ కాలేజీలో ఇలాంటి ఆరోపణలు లేవని కళాశాల సెక్రెటరీ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పోస్టు కోసం కోర్టును ఆశ్రయించిన ఆమెకు అక్కడ ఇబ్బందులు ఎదురుకావడంతో ఈ విధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభించి వీక్షిస్తున్న సీపీ సీవీ ఆనంద్ తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన

- కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసులు, పిరమల్ ఫైనాన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం సీపీ సీవీ ఆనంద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో పిరమల్ సంస్థ సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తోందని, నగరంలో ఈ తరహా అవగాహన కార్యక్రమాలను ప్రారంభించడం మంచి విషయమన్నారు. రద్దీ ప్రదేశాల్లో రోడ్లపై నుక్కడ్ నాటక్, బ్యానర్లు, పోస్టర్‌లు ప్రదర్శించడం ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతేకాకుండా అవగాహన కార్యక్రమాలతో పాటు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన డిజిటల్ సెక్యూరిటీ అంశాలపై సైతం నగర వాసులకు అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు పిరమల్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చోరీ చేసిన బైక్‌లపై తిరుగుతూ సెల్‌ఫోన్ల అపహరణ

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పంజాగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ సెల్ ఫోన్ల అపహరణలకు పాల్పడుతున్న ముఠాను పంజాగుట్ట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, 12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులలో ఒకరిని జైలుకు, ముగ్గురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపల్లి విజయనగర్ కాలనీకి చెందిన మహమ్మద్ షేక్ ఒమర్(18) అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలురితో కలసి ముఠాను ఏర్పాటు చేశాడు. రాత్రి, తెల్లవారుజామున నగరం, శివారు ప్రాంతాల్లో తిరుగుతూ ద్విచక్రవాహనాలు దొంగతనం చేసేవారు. వాటిపై తిరుగుతూ నడిచి వెళ్తున్న వారి చేతుల్లో నుంచి మొబైల్ ఫోన్లు లాక్కుని వెళ్లిపోయేవారు. ఆ ఫోన్లను అబిడ్స్ జగదీష్ మార్కెట్‌లో విక్రయించి జల్సాలు చేసేవారు. ద్వారకాపురి కాలనీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మనూషా ఈ నెల 16న నిమ్స్ బస్ స్టాప్ వద్ద నుంచి నడుచుకుంటూ వెళుతుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

అపహరించిన సెల్‌ఫోన్‌ను జగదీష్ మార్కెట్‌లో విక్రయిస్తుండగా మహమ్మద్ షేక్ ఒమర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పంజాగుట్ట, గచ్చిబౌలి, బంజారాహిల్స్, రాజేంద్రనగర్, మాదాపూర్, చైతన్యపురి, కేపీహెచ్‌బీ, ఫిలింనగర్ పీఎస్ పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు.



వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

ఎర్రగడ్డ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎర్రగడ్డ వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఎర్రగడ్డ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రేమ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి స్థానిక నాయకుల సహకారం ఎంతో అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీ నగర మాజీ ప్రధాన కార్యదర్శి గంటా మల్లేష్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో తాగునీటి పైప్‌లైన్లలో మురుగునీరు కలుస్తోందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ వైస్ చైర్మన్ మొహమ్మద్ సర్దార్, నాయకులు మహమ్మద్ అజ్జు, వాటర్ వర్క్స్ అధికారి షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

పంజాగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు పేర్కొన్నారు. ట్రాఫిక్, అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని వారు ట్రాఫిక్ వెస్ట్ జోన్ ఏసీపీ కె.హరిప్రసాద్‌కు బుధవారం విజ్ఞప్తి చేశారు. కాలనీతో సంబంధం లేనివారు సైతం కాలనీ మధ్యలో నుంచి ప్రవహిస్తున్న నాలాకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డివైడర్ వద్ద వాహనాలు నిలిపి వెళుతున్నారని ఏసీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్తీ మద్యం విక్రయిస్తున్న ముఠా సభ్యుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపి విక్రయిస్తున్న ఒడిశా ముఠాను బుధవారం హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్, అమీర్‌పేట్ సీఐ బానోత్ పటేల్ సిబ్బందితో కలిసి అమీర్‌పేట్, కృష్ణానగర్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగ్‌లో తనిఖీ చేయగా ఖరీదైన తొమ్మిది నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు లభించాయి. వారిచ్చిన సమాచారం మేరకు మదాపూర్ అయ్యప్ప సొసైటీలోని సాయినగర్‌లోని ఓ ఇంట్లోకి వెళ్లారు. అక్కడ మరో ముగ్గురు వ్యక్తులు ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపుతుండగా పట్టుకున్నారు. పట్టుబడిన ముగ్గురు ఒడిశాకు చెందిన రుద్రప్రతాప్ రౌత్, సత్యప్రకాష్‌రౌత్, రింకుజాన్‌గా గుర్తించారు. 14 మద్యం బాటిళ్లను, 63 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.8 లక్షలు ఉంటుందని, 5 సెల్‌ఫోన్లు, ఒక స్కూటీని సైతం స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేశారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు

- రూ.2.53 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని ప్రారంభించి, మనీ లాండరింగ్ కేసుల పేరు చెప్పి, 9 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.2.53 లక్షలు దోచేశారు. నగరానికి చెందిన వ్యక్తి(30)కి ఆటోమేటెడ్ కాల్ వచ్చింది. డీహెచ్‌ఎల్ నుంచి సంప్రదిస్తున్నామని, మీ పార్సిల్ రిజెక్ట్ అయిందని రికార్డెడ్ వాయిస్ వచ్చింది. వివరాల కోసం 1కి డయల్ చేయాలని సూచన రావడంతో, బాధితుడు 1 నొక్కాడు. డీహెచ్‌ఎల్ ప్రతినిధి అని పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి.. మీ పేరున ముంబై నుంచి దుబాయ్ వెళ్లే పార్సిల్‌లో ఎండీఎంఏ డ్రగ్ లభ్యమైందని, పోలీసులు విచారణ చేస్తున్నారని చెప్పాడు. పోలీసులతో సంప్రదించమంటూ ఫోన్ కలిపాడు. ముంబై పోలీస్ అధికారినంటూ పరిచయం చేసుకున్న మరోవ్యక్తి మీ ఆధార్ నంబర్, వివరాలతో ముంబై అంధేరి బ్యాంక్‌లో ఖాతా ఉందని, ఈ ఖాతా నుంచి విదేశాలకు డబ్బు మళ్లించారని చెప్పాడు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన వ్యక్తి వద్ద మీ ఏటీఎం కార్డు ఉందని, అందువల్లే అనుమానితుడి కింద కేసు నమోదు చేశామని చెప్పాడు. తనకు పార్శిల్‌కు, బ్యాంక్ ఖాతాలకు ఎలాంటి సంబంధం లేదని బాధితుడు చెప్పినప్పటికీ సైబర్ నేరగాడు వినిపించుకోలేదు.

కేసు దర్యాప్తులో భాగంగా డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టిన నేరగాడు, అతడి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నాడు. 9 రోజుల పాటు విచారణ పేరుతో భయపెట్టి రూ.2.53 లక్షలు తమ ఖాతాల్లో జమ చేయించుకున్నాడు. కేసు దర్యాప్తు గురించి ఇతరులకు చెప్పకూడదని, ఇది దేశ రహస్యాలకు సంబంధించినదని చెప్పాడు. దర్యాప్తు గురించి ఇతరులతో చెబితే జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా ఉంటుందని భయపెట్టాడు. అంతేకాకుండా బాధితుడి పేరుతో పర్సనల్ లోన్ తీయించే ప్రయత్నం చేశాడు. లోన్ రాకపోవడంతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేయడం మానేశారు. డబ్బు తిరిగి జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు

హెచ్‌యూజేకు జర్నలిజంలో సుదీర్ఘ చరిత్ర

● మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

బర్కత్‌పుర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే)కు జర్నలిజంలో సుదీర్ఘ చరిత్ర ఉందని, ఎందరో సీనియర్ పాత్రికేయులు ఈ సంఘంలో బాధ్యులుగా కొనసాగి విశిష్ట సేవలందించారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు కొనియాడారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హెచ్‌యూజే-2025 మీడియా డైరీని హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ ఆలీతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, మాజీమంత్రి షబ్బీర్ ఆలీ, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, కార్యదర్శి వర్కాల యాదగిరి, హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ అమీర్ షౌకత్, ఉపాధ్యక్షులు జే.పి.చారి, లక్ష్మణ్, ఇబ్రహీం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు గౌస్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న హమాలీలు

హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

బోయిన్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో హమాలీల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో పనిచేసే ప్రైవేట్ హమాలీలు 30 సంవత్సరాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలరె పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. హమాలీల సంఘం అధ్యక్షుడు ఉగ్రం రాములు ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంటనే మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబుతో మాట్లాడి వారికి భోజనం, విశ్రాంతి తీసుకోవడానికి హాలు, మూత్రశాలల ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి డీసీ, డీసీపీ, కార్పొరేటర్ పర్యటన

రెజిమెంటల్‌బజార్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త, నాలాల్లో పూడిక తదితర అంశాల పరిశీలనకు నార్త్ జోన్ డీసీ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ డీసీపీ సుస్మిత, కార్పొరేటర్ కొంతం దీపిక క్షేత్రస్థాయిలో పర్యటించారు. బుధవారం క్లాక్ టవర్, రైల్వే స్టేషన్ రోడ్డు, పాలికా బజార్, 31 బస్టాప్, చాపలబావి ప్రాంతాల్లో పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా వ్యాపారాలు చేయవద్దని, రోడ్లపై చెత్త వేయకూడదని వ్యాపారులకు డీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ధనాగౌడ్, ఏఈ చంద్రశేఖర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడితో ఈటల సమావేశం

సికింద్రాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు సమస్యలు, అభివృద్ధి పనులపై కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్‌వీ నంజుండేశ్వరతో ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం బొల్లారంలోని కార్యాలయంలో సమావేశమయ్యారు. కంటోన్మెంట్ సర్వీసు చార్జీల విషయంపైన, మౌలిక వసదుపాయాల మీద, రోడ్డు విస్తరణ పనుల గురించి, డిఫెన్స్ లాండ్స్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.300 కోట్లకి సంబంధించి వాటి పనుల గురించి, కొన్ని ఆలయాల్లో ఎంట్రీ ఇవ్వకపోవటంపై తదితర సమస్యలపై చర్చించారు. ఎలవేటెడ్ కారిడార్‌లో భాగంగా మెట్రో పొడిగింపు(జూబ్లీ బస్టాండ్ నుంచి శామీర్‌పేట వరకు, సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి మేడ్చల్) వరకు జరిగే పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు నర్మదా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి దేవాలయంలో అమావాస్య పూజలు

తిరుమలగిరి జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం అమ్మవారికి మహంకాళి అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త యశ్వంత్‌కుమార్ సహకారంతో దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రతీ అమావాస్యకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీశంకర్, బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ, ఎర్రోళ్ల రుక్మయ్య, చిన్నన్న, పి.రాజు, ఉమేష్, వేణు, జాను, సురేష్ కుమార్, సురేందర్, అనురాధ రెడ్డి, శ్రీను, హన్మంతు లు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు

● రూ.2.53 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని ప్రారంభించి, మనీ లాండరింగ్ కేసుల పేరు చెప్పి, 9 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.2.53 లక్షలు దోచేశారు. నగరానికి చెందిన వ్యక్తి(30)కి ఆటోమేటెడ్ కాల్ వచ్చింది. డీహెచ్‌ఎల్ నుంచి సంప్రదిస్తున్నామని, మీ పార్సిల్ రిజెక్ట్ అయిందని రికార్డెడ్ వాయిస్ వచ్చింది. వివరాల కోసం 1కి డయల్ చేయాలని సూచన రావడంతో, బాధితుడు 1 నొక్కాడు. డీహెచ్‌ఎల్ ప్రతినిధి అని పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి.. మీ పేరున ముంబై నుంచి దుబాయ్ వెళ్లే పార్సిల్‌లో ఎండీఎంఏ డ్రగ్ లభ్యమైందని, పోలీసులు విచారణ చేస్తున్నారని చెప్పాడు. పోలీసులతో సంప్రదించమంటూ ఫోన్ కలిపాడు. ముంబై పోలీస్ అధికారినంటూ పరిచయం చేసుకున్న మరోవ్యక్తి మీ ఆధార్ నంబర్, వివరాలతో ముంబై అంధేరి బ్యాంక్‌లో ఖాతా ఉందని, ఈ ఖాతా నుంచి విదేశాలకు డబ్బు మళ్లించారని చెప్పాడు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన వ్యక్తి వద్ద మీ ఏటీఎం కార్డు ఉందని, అందువల్లే అనుమానితుడి కింద కేసు నమోదు చేశామని చెప్పాడు. తనకు పార్సిల్‌కు, బ్యాంక్ ఖాతాలకు ఎలాంటి సంబంధం లేదని బాధితుడు చెప్పినప్పటికీ సైబర్ నేరగాడు వినిపించుకోలేదు. కేసు దర్యాప్తులో భాగంగా డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టిన నేరగాడు, అతడి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నాడు. 9 రోజుల పాటు విచారణ పేరుతో భయపెట్టి రూ.2.53 లక్షలు తమ ఖాతాల్లో జమ చేయించుకున్నాడు. కేసు దర్యాప్తు గురించి ఇతరులకు చెప్పకూడదని, ఇది దేశ రహస్యాలకు సంబంధించినదని చెప్పాడు. దర్యాప్తు గురించి ఇతరులతో చెబితే జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా ఉంటుందని భయపెట్టాడు. అంతేకాకుండా బాధితుడి పేరుతో పర్సనల్ లోన్ తీయించే ప్రయత్నం చేశాడు. లోన్ రాకపోవడంతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేయడం మానేశారు. డబ్బు తిరిగి జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద

నో ట్రాఫిక్!



రైల్వే స్టేషన్ ఎదురుగా ఖాళీగా కనిపిస్తున్న రోడ్డు

● ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ సక్సెస్ ● సంతోషం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రయాణికులు



అల్ఫా హోటల్ వైపు తొలగించిన బారికేడ్లు

అడ్డగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఏళ్ల నాటి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్‌పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నిరంతరం ఎప్పటికప్పుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద మానిటరింగ్ చేస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్‌కు ఒకవైపు ప్రయాణికులు అభినందనలు తెలుపుతున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రెండు ముఖ ద్వారాలు ఉండగా ఉదయం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు రావాలంటే నరకం అనుభవించాల్సి వచ్చింది. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ప్రయాణికులు వెళ్లాల్సిన రైళ్లు వెళ్లిపోవడంతో ప్రయాణికులు నిరాశ వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రావడానికి 45నిమిషాలు సమయం పడితే రైల్వేస్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్యతో రైల్వేస్టేషన్ ఎంట్రీ నుంచి స్టేషన్‌కు వెళ్లడానికి అరగంట సమయం పడుతుంది. కొన్నేళ్ల నుంచి ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఇక సులువు మార్గంగా మారింది. కేవలం 5 నిమిషాల్లో స్టేషన్ ఎంట్రీ నుంచి స్టేషన్ లోపలికి వెళ్లవచ్చని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్టేషన్ ఎదురు ఇరువైపులా దుకాణాలను తొలగించడంతో ఖాళీగా కనిపిస్తున్న రోడ్డు

సమస్యను గుర్తించి..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఆల్ఫా హోటల్ వద్ద ప్రతిరోజూ అంటే 24 గంటలూ ఆటోలు అడ్డదిడ్డంగా పార్కు చేయడం, బారికేడులకు సెల్ ఫోన్ విడిపరికాలు తగిలించి విక్రయించడం పదుల సంఖ్యలో వ్యాపారం కోసం రోడ్డును ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. ఇంత కాలం రైలు దిగి బయటికి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైలు దిగి బయటికి రావాలంటే దాదాపు 20 నిమిషాలు పట్టేది. అలాంటిది సులువుగా బయటికి వెళ్లిపోవచ్చు. అనేక సార్లు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించినప్పటికీ పోలీసులు తనవంతు ప్రయత్నం చేసినప్పటికీ ఆటో వాలాలు, చిరువ్యాపారాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.

స్టేషన్ ఎదురు ఖాళీగా రోడ్డు..

రైల్వే స్టేషన్‌లో ప్రతిరోజూ దాదాపు 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్టేషన్ నుంచి బయటికి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడేది. ఈ క్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు దాదాపు నెల రోజుల నుంచి ట్రాఫిక్ సమస్య తీర్చడానికి ప్రక్షాళన చేశారు. ఎవరు కూడా రైలు కోసం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడవద్దు. మరోవైపు చిరువ్యాపారులు ఇబ్బందులు పడవద్దని అనుకుని ఇరుకు గల్లీల వద్ద ఉన్న డబ్బాలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. మరోవైపు గేటు నెంబరు 1 నుంచి సాయంత్రం సమయంలో స్టేషన్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్‌లో ప్రయాణికులు చిక్కుకపోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం ప్రయాణికులు క్షణాల్లోనే స్టేషన్‌లోపలికి వెళ్లడానికి క్యూ పద్ధతిని ప్రవేశపెట్టారు.

ట్రాఫిక్‌లో చిక్కుకుని రైలు ఎక్కలేకపోయారు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రైలు దిగిన ప్రయాణికులు ట్రాఫిక్ నరకంలో ఇరుక్కుపోయేవారు. నెల రోజుల నుంచి ట్రాఫిక్ ప్రక్షాళనపై ఏరియల్ సర్వే చేశాం. ఆల్ఫా హోటల్ ముందు రైల్వే స్టేషన్ గేటుకు ఆనుకుని చిరువ్యాపారులతో పాటు ఆటోలు స్టేషన్ నుంచి బయటికి వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేవారు. ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. రైల్వే స్టేషన్ బయట గేటు ముందు బారీకేడ్లు ఉన్న వాటిని తొలగించి రైల్వేపార్శల్ కార్యాలయం నుంచే వాహనాలను సులవుగా బయటికి వచ్చేందుకు అక్కడున్న చిరువ్యాపారులను తొలగించి మరోచోట పెట్టుకోమని చెప్పారు. చిరు వ్యాపారులను ఎవరిని కూడా ఇబ్బంది పెట్టకూడదన్న కారణంతోనే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశాను. రోడ్డుకు అడ్డంగా ఉన్న బారీకేడ్లను తొలగించడంతో రెండు వైపులా ఐదు నిమిషాల్లో లోపలికి వెళ్లవచ్చు. రైలు దిగి బయటికి వస్తున్న ప్రయాణికులు ఐదు నిమిషాల్లో బయటికి రావచ్చు. రైల్వే స్టేషన్ చరిత్రలోనే ఈసారి ట్రాఫిక్ సమస్యపై ప్రక్షాళన చేశాం. రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారు. తోటి సిబ్బంది సాయం వల్లనే ట్రాఫిక్ ప్రక్షాళన చేయడానికి ముందుకు వచ్చాను. రైలు దిగిన ప్రయాణికులు ఎవరు కూడా ఇబ్బందులు పడకూడదు.

- నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● రోడ్డు భద్రతపై బోయిన్‌పల్లిలోని ఎయిర్‌ఫోర్స్ పాఠశాల విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన



చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ట్రాఫిక్, ఎయిర్ ఫోర్స్ అధికారులు



రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ఎయిర్ ఫోర్స్ అధికారులు

బోయిన్‌పల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రమాదాల నివారణ ట్రాఫిక్ నిబంధనలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సికింద్రాబాద్ నార్త్ జోన్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ కమిషనర్ సీవీ.ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, శ్రీరాహుల్ హెగ్డే, డీసీపీల ఆదేశాల మేరకు బుధవారం సికింద్రాబరాద్ నార్త్ జోన్ ఏసీపీ జి.శంకర్‌రాజు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ అనే అంశంపై బోయిన్‌పల్లిలోని ఎయిర్ ఫోర్స్ సిబ్బందికి, ఎయిర్ ఫోర్స్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు 3 నెలల జైలుశిక్షను కూడా విధిస్తారని చెప్పారు. వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్ వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం ప్రమాదకరం అన్నారు. మోటారు వెహికల్ చట్టం ప్రకారం రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే సెక్షన్ 119/177, 184 ప్రకారం శిక్ష తప్పదన్నారు. 6 నెలల వరకు జైలుశిక్ష లేదా రూ.1000 జరిమానా లేదా రెండూ విధిస్తారని హెచ్చరించారు. ఎయిర్‌ఫోర్స్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాలు, నివారణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది, ఎయిర్ కమాండర్ రుసుఖేష్, సీఈవో ప్రేమ్‌కుమార్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, బేగంపేట్ టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ, హీరో మోటో కార్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సాదిక్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఊరుకోం

● ఏసీపీ శంకర్‌రాజు



ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్/అడ్డగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కుల చెరలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల మంకాళి ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. సికింద్రాబాద్ సుభాష్ రోడ్డులోని నాగెల్లి దుర్గయ్య యాదవ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు గేటుకు అడ్డంగా వ్యాపారాలను కొనసాగిస్తున్న అక్రమ వ్యాపారులను మహంకాళి ట్రాఫిక్ పోలీసులు తొలగించి, పాఠశాల పూర్వవిద్యార్థి, ఎంఐఎం రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పాపడ్ అశోక్ సహకారంతో ఫెన్సింగ్ వేశారు. కాగా, బుధవారం ఏసీపీ శంకర్‌రాజు ఆ ప్రాంతాన్ని పరిశీలించి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రాజు మాట్లాడుతూ.. ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా వ్యాపారాలను సాగిస్తే ఊరుకునేది లేదని, తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. అనంతరం పాపడ్ అశోక్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదువుకున్న తాను పాఠశాలకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతోనే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎంపీలాడ్స్ నుంచి పాఠశాల అభివృద్ధికి రూ.45లక్షల నిధులను కేటాయించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేయడం, పాఠశాలకు రంగులు వేయించే పనులు చేశామన్నారు.



గాంధీ మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి సభ్యులు

అజయ్ మృతదేహం కుటుంబసభ్యులకు అప్పగింత

గాంధీ మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేసిన బీసీ రాజ్యాధికార సమితి

అడ్డగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌లో మూడు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతిచెందిన అజయ్ మృతదేహానికి గాంధీ ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కాగా, అజయ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీసీ రాజ్యాధికార సమితిప్రతినిధి సురేష్ మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మారేడుపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపడుచుల వివాహానికి మొట్టమొదటగా ఆర్థిక సహాయం అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో అమీర్‌పేట, బేగంపేట డివిజన్లకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, నామన సంతోష్ కుమార్, శ్రీహరి, ప్రవీణ్ రెడ్డి, శేఖర్, కూతురు నర్సింహ, గోపీలాల్ చౌహాన్, బలరాం, ఆరీఫ్, అఖిల్, హరిసింగ్, సుమిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

గద్దర్ అవార్డు గురించి బండికేం తెలుసు

● కాంగ్రెస్ పార్టీ సేవాదళ్

అడ్డగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంటనే గద్దర్. అలాంటి వ్యక్తికి గద్దర్ అవార్డులు ఇవ్వబోమన్న కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్, తన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత, ఉపాధ్యక్షురాలు రామలీల డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గురించి బండికి ఏమీ తెలియదని, ఉద్యమం చేసిన సమయంలో బండి కనిపించాడా? అని అన్నారు. తెలంగాణలో ప్రజలు ఒకవైపు తిండి లేక, నీళ్ల లేక, నిద్ర లేక అనేక కష్టాలు అనుభవించి ప్రజలకు అన్ని హక్కులు కల్పించిన ఘనత ప్రజాఉద్యమ గాయకుడు గద్దర్‌కు దక్కిందన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటిస్తే 'నీకేం బాధ' అన్నారు. 'నీ ఇంట్ల నుంచి ఇవ్వడంలేదు కదా'. గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.



ఢిల్లీకి రైలులో బయల్దేరిన సంగీత బృందం

ఢిల్లీకి వెళ్లిన కాంగ్రెస్ సేవాదళ్ నాయకుల బృందం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగే కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సమావేశానికి సికింద్రాబాద్ నుంచి ఢిల్లీకి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత, ఉపాధ్యక్షురాలు రామలీలతో పాటు ముఖ్యనాయకులు బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రైలులో బయల్దేరి వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలపై సేవాదళ్ సమావేశంలో ముఖ్య నాయకుల దృష్టికి తీసుకొస్తామని తెలిపారు.



హమాల్‌బస్తీలో డప్పుల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

'వేల గొంతులు-లక్ష డప్పులు'ను జయప్రదం చేయాలి

చిలకలగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1న తలపెట్టిన మాదిగ-మాదిగ ఉపకులాల సదస్సు 7న తలపెట్టిన వేల గొంతులు-లక్ష డప్పుల సదస్సును జయప్రదం చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మెట్టుగూడ డివిజన్ హమాల్‌బస్తీలో బుధవారం నిర్వహించిన డప్పుల ప్రదర్శన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా, మహజన సోషలిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి విజయకుమార్, మాదిగ రాష్ట్ర పోరాట సమితి జాతీయ ప్రతినిధి మలికార్జున్ మాదిగ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మెదటగా తెలంగాణలో అమలు చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని, లేదంటే మాదిగల నిరసనను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కార్యకర్తలు డప్పులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేష్ మాదిగ, సుధాకర్ మాదిగ, నర్సింగరావు, సుజాత, శోభ, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసన్‌కు డాక్టరేట్

తార్నాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక రంగంలో సమాజ పురోభివృద్ధికి చేస్తున్న కృషికి గాను యునైటెడ్ థియాలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి ప్రముఖ ఎంటర్‌ప్రెన్యూర్ పి.ఆర్.శ్రీనివాసన్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.దీపక్ ఫ్రాన్సిస్ చేతుల మీదుగా డాక్టరేట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఈ అవార్డుతో తనకు బాధ్యత మరింత పెరిగిందన్నారు.



అవార్డును అందుకుంటున్న పీఆర్ శ్రీనివాసన్